

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,7 జనవరి 2026 | 8 పేజీలు


## సారా మాఫియాపై 'పీడీ యాక్ట్' అస్త్రం

# తప్పు చేస్తే ఖైదే

**- మంత్రి కొల్లు రవీంద్ర సంచలన హెచ్చరిక !**



**రాజమహేంద్రవరం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

"రాష్ట్రంలో సారా మాఫియా ఆటలు ఇక సాగవు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే" అని రాష్ట్ర ప్రొహిబిషన్ & ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అత్యంత శక్తివంతమైన హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి కొల్లురవీంద్ర ఎక్సైజ్‌శాఖ పనితీరుపై నిప్పులుచెరిగారు.ఎక్సైజ్‌శాఖ అంటే కేవలం ప్రభుత్వఖజానా నింపేవనరు మాత్రమే కాదని,మద్యం వినియోగాన్ని దశలవారీగా తగ్గించి సమాజాన్ని రక్షించే బాధ్యతగలశాఖ అని ఆయన స్పష్టంచేశారు.బెల్ట్ షాపులు, నాటుసారా మూలాలపై ఉక్కుపాదం మోపాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కనికరం లేకుండా:పీడీయాక్ట్: ప్రయోగించాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. ఇప్పటికే14 మందిపై పీడీ కేసులు నమోదు చేశామని, భవిష్యత్తులో ఈ వేటు మరింత తీవ్రంగా ఉంటుం దని ఆయన హెచ్చరించారు.గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన ఎక్సైజ్‌వ్యవస్థను పూర్తిగా ప్రక్షళన చేస్తున్నామని,

- తరువాయి 2లో..

## గ్యాస్ లీకేజీపై

# ఆందోళన వద్దు

**- కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఇరుసుమండ గ్రామంలో నిన్న జరిగిన గ్యాస్ లీకేజ్ మూలంగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాల వారు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, మంటలు అదుపు లోనికి వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళ వారం సాయంత్రం ఆయన స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికేయులు సమావేశం నిర్వహించి గ్యాస్ లీకేజీ సందర్భంగా ఓఎన్జిసి చేపట్టిన గ్యాస్ లీకేజ్ మంటల నియంత్రణ చర్యల పరిణామాలను పాత్రికేయులకు వివరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్‌జిసి చమురు బావి నందు పెర్ఫోరేషన్ చేస్తుండగా ఈ నెల 5 వ తేదీ ఉదయం 11:30 గంటలకు గ్యాస్ లీకేజీ అయ్యి 12:30 గంటలకు

- తరువాయి 2లో..

## రైతు సంక్షమమే

# కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలో రూరల్ ఎమ్మార్వో ఎస్.ఎల్. ఎన్.కుమారి ఆధ్వర్యంలో తిమ్మాపురం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన నూతన పట్టాదారు పాస్‌బుక్ పంపిణీ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో కూడిననూతనపట్టాదారు పాస్‌బుక్కుల ను అధికారికంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యేనానాజీ మాట్లాడు తూ, కూటమి ప్రభుత్వం రైతుల భూ హక్కులకు పూర్తి భద్రత కల్పించాలనే లక్ష్యంతో భూములను సర్వే చేసి, నూతన యజమానులపేర్లతోపట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించిందని తెలిపారు. గతంలో ఉన్న భూసమస్యలు, వివాదాలు పరిష్క రించి, రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

ఈ నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు అర్హులైన ప్రతీ రైతుకు తప్పనిసరిగా పాస్‌బుక్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించి, వ్యవసాయ అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు.ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలో తిమ్మాపురం గ్రామంలో 16 కోట్ల 49 లక్షల రూపాయలతో వివిధ సంక్షమ పథకాలకి, అభివృద్ధి పథకాలకు ఖర్చు చేశామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమినాయకులు పెంౖ శ్రీనివాస్ బాబా, వల్లూరిరాజా, నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, రంభాల వెంకటేశ్వరరావు, నూరుకుర్తి వెంకటేశ్వరరావు, మాదారపు తాతాజీ, బోళ్ల కృష్ణ మోహన్, బందిల వీరీష, పితాని లీల, తాటికాయల వీరబాబు, కరెడ్ల గోవింద్,

- తరువాయి 2లో..

## భోగాపురం విమానాశ్రయంతో

# ఉత్తరాంధ్రకు విశ్వఖ్యాతి

- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ప్రాణం పోసింది సీఎం చంద్రబాబే
- ఫైళ్లలో మగ్గిన ప్రాజెక్ట్‌ను పరుగులు పెట్టించిన సీఎం
- ఉత్తరాంధ్ర భవితకు భోగాపురం గేట్వే చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం
- అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ పాలన - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర కు విశ్వక్యాతి దక్కనుందని, ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో కర్త, కర్మ, క్రియాగా సీఎం చంద్రబాబు నాయుడే చేసారని రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ విషయం జగన్ పాలనలో మరుగున పడిందని, కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చాక శరవేగంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయ్యే దశకు చేరిందని ఒకప్రకటనలో పేర్కొన్నా రు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, నిర్ణయాత్మక నిర్ణయాలుతో ఎయిర్ పోర్ట్ కు 2014-19 మధ్య శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్నిఅంతర్జాతీయ అభివృద్ధి పటంపై నిలపాలన్న సంకల్పంతో భోగాపురం విమానాశ్రయాన్ని రూపకల్పన చేసిభూసేకరణ, కేంద్ర ప్రభుత్వ అనుమతులు, పెట్టుబడుల సమీకరణ వంటి క్లిష్ట అంశాలన్నింటినీ సమర్థంగా పరిష్కరించి ప్రాజెక్టు ను పట్టాలెక్కించిన ఘనతఆయనకే దక్కుతుందని మంత్రి తెలిపారు.జగన్

- తరువాయి 2లో..

# ఆర్యవైశ్యులకే శ్రీపాద వల్లభ చైర్మన్ పదవి ఇవ్వాలి

**– పిఠాపురం ఆర్యవైశ్య, వాసవి క్లబ్ సంఘాల డిమాండ్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం ఏర్పాటుకు, సంస్థానం దినదినాభివృద్ధి కావడానికి మూలకాంకులైన పిఠాపురం ఆర్యవైశ్యులకే శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం ఛైర్మన్ పదవిని కేటాయించాలని పిఠాపురం నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్ నాయకులు డిమాండ్ చేశారు. పిఠాపురం పట్టణం కోటగుమ్మం సెంటర్ వద్దగల వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రంలో మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షడు కేతవరపు కృష్ణ, ఆర్యవైశ్య సంఘం నాయకుడు పైండా సత్యరామన్న, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవ్యాలయం అధ్యక్షుడు దంగేటి సత్యనారాయణమూర్తి, బాదం శ్రీరామచంద్రమూర్తి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు పిఠాపురం ఆర్యవైశ్యులకిచ్చిన హామీని స్థానిక ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకోవాలని, ఈ విషయమై ఈ నెల 9న పిఠాపురం రానున్న పవన్ కళ్యాణ్‌ను తామంతా కలిసి విన్నవించుకుంటామన్నారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు కూరగాయల రఘు, దంగేటి దత్తు, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, బోడా శ్రీనివాస్, గొల్లపూడి సురేశ్, కేదారశెట్టి కామేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

**– జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు**

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మార్చిలో జరగనున్న10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత చెంది మెరుగైన ఫలితాలు సాధించాలని పోలవరం జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించడం జరిగింది. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజులు ప్రణాళిక అమలుచేయు విధానాన్ని విద్యార్థులతో వంద రోజులు ప్రణాళికలో భాగంగా రోజుకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని స్లిప్ టెస్ట్‌లు (డైలీ టెస్టులు) రాశారని, సబ్జెక్టు వారిగా విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అలానే పాఠశాల సబ్జెక్టు ఉపాధ్యాయులతో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి వంద రోజులు ప్రణాళిక అమలు చేస్తున్న విధానాన్ని మంగళవారం ఉపాధ్యాయుల ద్వారా ఏ విద్యార్థి ఏ గ్రేడ్‌లో ఉన్నారని అడిగి తెలుసుకోవడం జరిగింది. ముస్తాబు కార్యక్రమము పాఠశాలలో అమలు జరుగుతున్న విధానాన్ని




విద్యార్థులను అడిగి తెలుసుకుని అమలు జరుగు విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 సూరయ్య రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆదిలక్ష్మి, సిఆర్పి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

# భీమేశ్వర ఆలయాన్ని దర్శించిన శ్రీ సంస్థాన్ శాంతాశ్రమ మఠాధిపతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** మంగళవారం సాయంత్రం శ్రీ సంస్థాన్ శాంతాశ్రమ మఠాధిపతి శ్రీ వామానాశ్రమ మహా స్వామీజీ శ్రీ స్వామి వారి దర్శనమునకు విచ్చేసారు. శ్రీ స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం నంది మండపం నందు ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేసియున్నారు. అనంతరం ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం శ్రీస్వామి వారి ప్రసాదములు, స్వామి వారి చిత్రపటం అందజేసియున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంటే బాబు, ఆర్య వైశ్య సంఘం వారు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సచివాలయం ఉద్యోగికి తీవ్ర గాయాలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పెద్దాపురం రోడ్డు విమల్ డ్రింక్స్ ప్యాక్టరీ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలకు గురి అయ్యారు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన మోహన్ జగ్గంపేట మండలానికి చెందిన సచివాలయ కార్యదర్శిగా గుర్తించారు. సామర్లకోట నుండి జగ్గంపేట వెళుతుండగా ప్రమాదం సంభవించింది. స్థానికులు గాయపడిన మోహన్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్రకు విశ్వఖ్యాతి

**మొదటిపేజి తరువాయి**

పాలనలో ఈ కీలక ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఫైళ్లలోనే మగ్గేలా చేసి ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. అభివృద్ధి అంటే ఫ్లెక్సీలు, ప్రకటనలు కాదని అభివృద్ధి అంటే నిర్ణయాలు, కార్యా చరణ, ఫలితాలు అని చంద్రబాబు పాలన మరోసారి నిరూపిస్తోందని ఆయన అన్నారు. భోగాపురం విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ గుర్తింపు, పరిశ్రమలు, ఐటీ, పర్యాటక రంగాల్లో భారీ పెట్టుబడులు రావటం ద్వారా వేలాది యువతకు ఉపాధి అవకాశాలువిశాఖపట్నం పరిసర ప్రాంతాల ఆర్థిక విప్లవం, ఇవన్నీ సాధ్యమవు తుందన్నారు. సీఎం చంద్రబాబు ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, విజన్ వల్ల రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.నాలుగేళ్లు అభివృద్ధిని అడ్డగించినవారు ఇప్పుడు విమర్శలు చేసే నైతిక హక్కు కోల్పోయారని, పని చేసే నాయకుడు ఎవరో.. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నారో ప్రజలు స్పష్టంగా చూస్తున్నారని మంత్రి సుభాష్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గేట్‌వేగా నిలుస్తుందని, ఇది పూర్తిగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వ విజయమని మంత్రి తేల్చిచెప్పారు. ఎర్ర బస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌పోర్ట్ ఎందుకంటూ జగన్ అప్పట్లో అన్న మాటలు వాస్తవం కాదా అని మంత్రి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ పాలన చేశారని మంత్రి దుయ్యబట్టారు. కూటమి పాలన 18 నెలల కాలంలో విమానయాన నుంచి ముఖ్యమైన క్లియరెన్స్ లు, సిఐఎస్ఎఫ్ భద్రత దళాల నియామకం, కస్టమ్స్, ఇమిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐ సి పి) వంటి అనుమతులు వచ్చాయన్నారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలోనే భోగాపురం విమానాశ్రయం తీసుకొచ్చామని దుష్ప్రచారం చేయడం నీతిమాలిన చర్య అని మంత్రి సుభాష్ ఘాటుగా విమర్శించారు.

# సారా మాఫియాపై 'పీడీ యాక్ట్' అస్త్రం
## తప్పు చేస్తే ఖైదే

**మొదటిపేజి తరువాయి**

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాసిరకం మద్యం బ్రాండ్ల కాలం చెల్లిందని మంత్రి పేర్కొన్నారు. మద్యం నాణ్యతను నిశితంగా పరిశీలించేందుకు కాకినాడలో 13 రకాల అత్యాధునిక పరీక్షలు నిర్వహించే రీజినల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, ఇకపై ప్రతి చుక్కా క్వాలిటీ చెక్ దాటాల్సిందేనని తేల్చి చెప్పారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతోసహా పెకిలించడమే ప్రభుత్వ తక్షణ ధ్యేయమని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ఎక్సైజ్ వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి, అధికారులు క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు చూపి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో నాటు సారాను 90 శాతం వరకు అరికట్టడం శుభపరిణామమని, ఆ వృత్తిని వదిలిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు చైతన్య మురళీ, రేణుక, లావణ్య, కృష్ణకుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొని మంత్రి ఆదేశాలను అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

# గ్యాస్ లీకేజీపై ఆందోళన వద్దు

**మొదటిపేజి తరువాయి**

మంటలు వ్యాపించాయని తెలిపారు. ఈ యొక్క మంటలను అదుపు చేసేందుకు బోరుబావి చుట్టూ పంట కాలువల నుండి నీటిని నాలుగు పంపులు ద్వారా నీటిని పంపిణీ చేస్తుండడం మూలంగామంటలుచాలావరకు అదుపులోకి వచ్చాయన్నా రు. ఇరుసుమండ లక్కవరం, గుబ్బల వారి పాలెం గ్రామాలకు చెందిన సుమారు 450 మందిని బ్లో అవుట్ సంఘటన మూలంగా సురక్షత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. ఈ మూడు గ్రామాలవారు ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని, గ్యాస్ లీకేజీ మంటలు 90% తగ్గుముఖం పట్టాయని, రానున్న నాలుగు రోజులలో మంటలు అదుపులోకి వస్తాయని, మొత్తం మీద వారం రోజులలో బోరు బావికి క్యాపింగు బిగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఒకేసారి బోరు బావులు మంటలు అదుపు చేయడం వల్ల శాస్త్రీయంగా పర్యావరణపరంగా ఇబ్బందులు ఉన్నాయని ప్రత్యేక గ్యాస్ లీక్ నియంత్రణ టీములు నిర్ధారించిన నేపథ్యంలో వారి సూచనల మేరకు క్రమక్రమంగా మంటలను అదుపు చేస్తూ 4 రోజులలో పూర్తిగా మంటలను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. రెండు ప్రత్యేక నిపుణులతో కూడిన గ్యాస్ లీకేజ్ నియంత్రణ టీములు ముంబై నుంచి డ్రిల్లింగ్ ప్రాంతానికి చేరుకొని నియంత్రణ చర్యలకు సిద్ధమయ్యాయన్నారు.

గ్యాస్ లీకేజీబ్లో అవుట్ మూలంగా ఇరుసుమండ గ్రామంలో బోరుబావి చుట్టుపక్కల మూడు ఎకరాల విస్తీర్ణంలో వరి పంట, 75 కొబ్బరి చెట్లు దెబ్బతిన్నాయని, అదేవిధంగా సుమారు 450 మందికి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నష్టాల అంచనాలను గణించి నష్టపరిహారాలను అందించడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శాంతనూరు దాస్, రాజమండ్రి, సక్సేన న్యూ ఢిల్లీ, జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**మొదటిపేజి తరువాయి**

బత్తిన దొరబాబు, కాళ్ళ ధనరాజు, కర్రి వెంకటరాజు, నందూరి సత్తిబాబు, రాందేవు సీతయ్య దొర,తలాటందుర్గబాబు, సుంద రపు సతీష్, సోదే ముసలయ్య, చల్లపల్లి గణపతి, నందిక లోవబాబు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఇంటర్న్‌షిప్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ గ్రోత్' పై ఉపన్యాస కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడలో మూడవ సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం ఇంజనీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కాకినాడ (ఎకోశాక్) సహకారంతో "వారియర్స్ ట్రెయిల్ -ఇంటర్న్‌షిప్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ గ్రోత్" అనే అంశంపై ఆహ్వానిత ఉపన్యాస కార్యక్రమాన్ని 06-01-2026 న కళాశాలలోని అలుమ్నీ ఆడిటోరియంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వీజే మార్కాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మరియు ఎకోశాక్ ప్రెసిడెంట్ డా. కె.నాగిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని ఎకోశాక్ సెక్రటరీ డా. బి.నరేష్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా డా. కె.నాగిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పనిపరిజ్ఞానం,క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. ఇంటర్న్‌షిప్ చేయడం వల్ల విద్యార్థులకు పుస్తకాలలో ఉన్న జ్ఞానాన్ని వాస్తవ పనితీరుతో అనుసంధానించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ముందుగానే శిక్షణ పొందితే ఉద్యోగ రంగంలో పోటీని ధైర్యంగా ఎదుర్కొనగలరని, ఆత్మవిశ్వాసం పెరిగి నిర్ణయాలు తీసుకునే శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

శిక్షణ అనుభవం ఉన్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా లభిస్తాయని, వృత్తి జీవితానికి శిక్షణ ఒక బలమైన పునాదిగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎకోశాక్ సెక్రటరీ డా. బి.నరేష్ మాట్లాడుతూ, ఇలాంటి ఉపన్యాసాలు విద్యార్థులకు వృత్తి దిశను స్పష్టంగా చూపడంలో, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని ఆయన తెలిపారు.

# కాకినాడలో 9న డిప్యూటీ సీఎం పర్యటన

**- ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడలో నిర్వహించనున్న పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను కాకినాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ పరిశీలించారు.కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లపై రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మూర్తితో ఇంచార్జ్ కమిషనర్ చర్చించారు.అనంతరం రమణయ్యపేట మార్కెట్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ సందర్శించారు. అక్కడ అల్పాహారం స్వీకరిస్తున్న ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత, సదుపాయాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన ఫీడ్‌బ్యాక్ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే.టీ.సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రతి రైతు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించుకోవచ్చని అంబాజీపేట ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ముత్యాల నాయుడు, సీనియర్ సైంటిస్ట్ వీరభద్రరావు లు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకట రామన్నగూడెం అభ్యసిస్తున్న (=ఎఔజ్యా) విద్యార్థులు ప్రస్తుతం అంబాజీపేట హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్ పరిధిలోని ఉచిలి, వెలిచేరు వద్దిపర్రు గ్రామాలలో గత రెండు నెలలుగా సేవలు అందిస్తున్నారు. మొత్తం 20 మంది విద్యార్థులు గ్రామ స్థాయిలో రైతులతో కలిసి పనిచేస్తూ, శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, రైతుల నుండి ఆచరణాత్మక జ్ఞానాన్ని కూడా ఆర్జిస్తున్నారు. మంగళవారం సదాశివ కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులకు వివిధ ఉద్యాన పంటల సాగు, నిర్వహణ, వ్యాధి నియంత్రణ మరియు దిగుబడి పెంపు విషయాలపై సమగ్ర శాస్త్రీయ సమాచారాన్ని అందించారు హార్టికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. సంగమిత్ర, డిఆర్ఎం కల్పన, హెచ్ఓడి డాక్టర్ వై.లక్ష్మీప్రసన్న, ఫిజియాలజీ విభాగం సమావేశంలో పాల్గొని, రైతులకు పలు శాస్త్రీయ సూచనలు, పురుగుమందుల మరియు ఎరువుల వినియోగంపై మార్గదర్శకాలు అందించారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం తరపున డాక్టర్ ఎం.కల్పన కూడా ఈ సమావేశానికి హాజరై, విద్యార్థుల గ్రామీణ కార్యాచరణను అభినందిస్తూ, విశ్వవిద్యాల యం నిర్వహిస్తున్న గ్రామ ప్రాతిపదిక శిక్షణ కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు రైతులు, గ్రామ ప్రజల ఉత్సాహపూరిత సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. విద్యార్థులు రైతులకు శాస్త్రీయ జ్ఞానం అందించడంతో పాటు, గ్రామీణ వ్యవసాయ పరిస్థితులు, సవాళ్లు మరియు స్థానిక పద్ధతుల గురించి ప్రత్యక్షంగా నేర్చుకుంటూ తమ ప్రాయోగిక అనుభవాన్ని మరింతగా పెంపొందించుకుంటున్నారు.

# ర్యాలీ గ్రామంలో ఆత్మ సౌజన్యంతో నానో యూరియాపై అవగాహన



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** నానో యూరియా మరియు డి.ఏ.పి. వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అర లీటర్ నానో యూరి యా ఒక బస్తా యూరియాకి సమానంగా పనిచేస్తుంది అని, అన్ని పంటలలో లీటర్ నీటికి 3-4 మి.లీ. నానో యూరియా కలుపుకుని పిచికారీ చేయనుకుంటే మంచి దిగుబడి వస్తుంది అని ఆత్మ చైర్మన్ జక్కంపూడి బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ కుడప కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి జె.వి.ప ట్టాభి రామయ్య, ఆత్మ బ్లాక్ డైరెక్టర్లు బందెల ప్రసాద్, రాధాకృష్ణ, సొసైటీ అధ్యక్షులు మెర్ల నాగేశ్వరావు, జగన్మోహిని కేశవస్వామి ఆల య చైర్మన్ మెర్ల నాగేశ్వరావు, పంచాయతీ సెక్రటరీ జె.సాయిరామ్ రెడ్డి, టీడీపీ నాయకులు మద్దూరి సుబ్బారావు, పెండం వెంకన్న, జనసేన నాయకులు బందెల గుర్రయ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శిరీష, అమరగణసాయి పాల్గొన్నారు.

# వెంకన్న ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి పనులకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరంకు చెందిన శాఖ చిరంజీవి పుష్పావతి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116లు విరాళంగా అందించారు.

వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చరిత్ర గురించి వివరించారు. దాతలకు చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## ముమ్మిడివరం నగర పంచాయితీ

ఆర్.ఒ.సి. నెం: 15/2025/ఎ1 తేది. 06.01.2026

**బహిరంగ వేలం నోటీసు**

ముమ్మిడివరం నగర పంచాయితీ, రెవిన్యూ విభాగమునకు సంబంధించి 2025-26 సం॥మునకు గాను అనగా ది.01.01.2026 నుండి 31.03.2026 వరకు రోజువారీ మార్కెట్ మరియు వారపు సంత రుసుములు / ఆశీలు వసూలు చేసుకొనే హక్కును గుత్తకిచ్చుటకు గాను ది.07-01-2026వ తేదీ బుధవారం ఉదయం గం॥ 11.00 లకు నగర పంచాయితీ కార్యాలయములో కమిషనరు వారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే బహిరంగ వేలం నిర్వహించబడును.

| | |
|---|---|
| ధరావత్తు | రూ.75,000/-లు |
| సాల్వెన్సీ/బ్యాంకు గ్యారంటీ | రూ.1,00,000/-లకు |

కావున పాటలో పాల్గొనదల్చిన వారు పూర్తి వివరములను కార్యాలయ పని వేళల యందు రెవిన్యూ విభాగము వారిని సంప్రదించగలరు.

సం/- పి.రవివర్మ
కమిషనరు,
ముమ్మిడివరం నగర పంచాయితీ

సూర్య
www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో మెడికవర్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం

- ఆదిత్య విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ప్రసంగించిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత
- అతివేగం వద్దు సమయపాలన పాటించండి
- డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల (స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కాకినాడ మెడికవర్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థలలో సేవలు అందిస్తున్న బస్ డ్రైవర్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలనే ఉద్దేశ్యంతో కాకినాడ మెడికవర్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ మరియు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో డ్రైవర్ల యొక్క పాత్ర చాలా ముఖ్యమైనదని అన్నారు. డ్రైవర్లు వారి ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూనే తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని అన్నారు. ఆదిత్య విద్యా సంస్థలో డ్రైవర్లకు ఇస్తున్న ప్రోత్సాహకాలను, చేస్తున్న సేవలు గురించి తెలిపారు. అతివేగం వద్దు సమయపాలన పాటించండి అని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు తమ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. తమ కళాశాలలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి విచ్చేసిన మెడికవర్ హాస్పిటల్ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. రవాణా శాఖ మేనేజర్ కృష్ణమూర్తి డ్రైవర్లు పాటించవలసిన నియమాలను వివరించారు. ఈ సందర్భంగా గత నెలలో శ్రీకిరణ్ ఐ హాస్పిటల్ వారిచే నిర్వహించిన కంటి వైద్య పరీక్షలలో కళ్ళజోళ్ళు అవసరమయ్యే 30 మంది డ్రైవర్లకు ముఖ్య అతిథి డాక్టర్ శేషారెడ్డి చేతుల మీదుగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. తదుపరి సుదీర్ఘకాలంగా ఆదిత్య విద్యాసంస్థల రవాణా శాఖలో సేవలందిస్తున్న డ్రైవర్లను సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందించారు.అనంతరం మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ చెన్నకేశవరావు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మణ్ రోహిత్ బిపి, బ్లడ్ షుగర్, ఈసీజీ, టుడి ఈకో వంటి పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లు మరియు క్లీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెట్రరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ ప్రోగ్రాం మేనేజర్ జి శివప్రసాద్, కోఆర్డినేటర్ సూర్య భాస్కర్, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.కరుణ, వైస్ ప్రిన్సిపాల్స్ సత్యనారాయణ, జి.నాగ శ్రీకాంత్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, సురేఖ, ఫిజికల్ డైరెక్టర్ సత్యవతి, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఎంపిడిఓ సూర్యనారాయణ



**పెద్దాపుర: రూరల్,మేజర్న్యూస్ :** పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగినచర్యలుతీసుకోవాలనిఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో స్వచ్ఛ సంక్రాంతి, ప్రత్యేక శానిటేషన్ పనులను ఎంపిడిఓ కె.వి.సూర్య నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన పర్యటిస్తూ డ్రైన్లలో ఎప్పటికప్పుడు పూడిక తీయించి, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి వెళ్ళి తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరణ నిర్వహించి, ఎస్డబ్లూపి కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలని, చెత్త, చెదారం వీధులలో వేయకుండా పంచాయతి కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ జానీ ఖాన్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ఉత్తీర్ణత శాతం పెంచేలా బోధన నిర్వహించాలి



- డీఈవో రామకృష్ణారావు

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన అడ్డతీగలలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు బాలుర ఆశ్రమ పాఠశాలను కూడా ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వందరోజుల బోధన కార్యక్రమం తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్ ఏ -3 పరీక్షల నిర్వహణను దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరగతుల్లో బోధించనీ పాఠాలకు సంబంధించిన సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు.

100% ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు నిరంతర సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. స్థానిక ఆశ్రమ పాఠశాలలో అసంపూర్ణ భవనాల నిర్మాణాలను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించిన బిల్లులకు అనుకూలంగా నిర్మాణాలు ఎందుకు జరగలేదని రెండవ విద్యాశాఖ అధికారి శ్రీనివాసుని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడిని డ్రా చేసిన బిల్లులకు జరిగిన పనులకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలు సేకరించి తనకు నివేదించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే విద్యార్థులు వసతి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇకపై విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా నిర్మాణాలను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండల విద్యాశాఖ అధికారి రమేష్తో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్టల్స్ ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి ఏకగ్రీవ నిర్ణయం

- అసోసియేషన్ ప్రెసిడెంట్ క్రాంతి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రైవేట్ హాస్టల్స్ ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు సొసైటీ ఆఫ్ ప్రైవేట్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ క్రాంతి వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ తెలిపారు. కాకినాడ శాంతినగర్లో గల శ్రీ సాయి ఉమెన్స్ హాస్టల్ ప్రాంగణంలో సొసైటీ ఆఫ్ ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రెసిడెంట్ క్రాంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారాలపై సమావేశం చేశారు. ఈ సందర్భంగా సభ్యులంతా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులుగా కళావతి, అధ్యక్షురాలిగా క్రాంతి, కార్యదర్శిగా సురేష్ కోశాధికారిగా శివాజీ, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్గా స్టాలిన్, సహాయ కార్యదర్శిగా భవాని, కార్య వర్గ సభ్యులుగా విజయ్ పరమేష్ సత్యం నివాస్ వీరబాబు జై సూర్య లక్ష్మ అన్నపూర్ణ విజయ్ కోపల్లి సత్య కొరారి లను సభ్యుల ంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు క్రాంతి మాట్లాడుతూ ప్రైవేట్ హాస్టల్స్ ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులంతా ఐక్యంగా పనిచేసే హాస్టల్స్ అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరంలో గల 50 కి పైగా హాస్టల్ వానర్స్ హాజరయ్యారు.

# కార్డులు ఉన్న కుటుంబాలకు 125 రోజులు ఉపాధి పనులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో వికసిత్ భారత్ - రోజ్గార్, ఆజీ వికా మిషన్ (గ్రామీణ) వి బి జి రాం జీ ద్వారా ఉపాధి కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి 125 రోజులు ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి పనుల ఏపిడి టి. శ్రీనివాస్ విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం వికసిత్ భారత్ - ఉపాధి, జీవనోపాధి హామీ మిషన్ (గ్రామీణ) (విబి - జి రాం జీ) చట్టం 2025 కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం ద్వారా ప్రతీ కుటుంబంలో వంద రోజులు నుండి 125 రోజులు ఉపాధి పనులు కల్పించే విధంగా యుక్త ధార వెబ్సైట్లో ఉపాధి పనులు చేసిన వాటన్నిటిని అప్లోడ్ చేసే విధంగా 11 మండలాల ఉపాధి పనుల ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈలతో ఏపిడి శ్రీనివాసు విశ్వనాథ్, ఏపీవో సురేష్, రాఘవ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిబంధన ప్రకారం జాబ్ కార్డులు ఉన్న ప్రతీ కుటుంబానికి 125 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, అదేవిధంగా ప్రతి గ్రామంలో ఉపాధి పనులకు సంబంధించి వివరాలు ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయా గ్రామాలలో తీర్మానాలు చేయించాలన్నారు. ఏజెన్సీలో అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేసి వాటిని యుక్తదార వెబ్సైట్లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లు ప్రకాష్, రెడ్డిబాబు, శ్రీనివాస్, సత్యనారాయణ, అరవాలు, సాయిబాబా, రాఘవయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# వెదురు ద్వారా గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

**– జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన మహిళలు వెదురు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, అలాగే వేల ఎకరాలలో గిరిజన రైతులు వెదురు పెంచేందుకు కృషి చేస్తామని పోలవరం జిల్లా రంపచోడవరం ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టీంతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, డీఎఫ్ఓలు రవీంద్రనాథ్ రెడ్డి, శివకుమార్ గంగల్, సబ్ డిఎఫ్ఓలు టి.అనూష, జె.వి.సుబ్బారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ గిరిజన మహిళలు వెదురు అభివృద్ధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతంలోని ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూములు, ప్రైవేట్ భూములు, అదేవిధంగా గిరిజన కమ్యూనిటీ భూముల్లో వేల హెక్టార్లలో వెదురు అభివృద్ధి చేయడానికి అవకాశం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టీం ద్వారా ఎన్ని ఎకరాలలో వెదురు అభివృద్ధి చేయుచున్నది ఆయన ఆరా తీశారు. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ద్వారా, హార్టికల్చర్, అగ్రికల్చర్, సమన్వయంతో వెదురు అభివృద్ధి చేయాలన్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో గిరిజన భూముల్లో వెదురు అభివృద్ధి ఏ విధంగా చేయుచున్నది ఆయన ఆరా తీశారు. గిరిజన గ్రామాలలో వెదురు అభివృద్ధి చేయుటకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టీం ద్వారా వెదురు మార్కెటింగ్ ఏ విధంగా చేయుచున్నది ఆయన ఆరా తీశారు.

ఏజెన్సీలో ఎంపిక చేసిన గిరిజన భూముల్లో కమిటీల ద్వారా ఎన్ని హెక్టార్లలో వెదురు ప్లాంటేషన్ వేస్తున్నారో ఆయన ఆరా తీశారు. కమ్యూనిటీ ఫారెస్ట్ రేంజ్‌లో ఎంత ల్యాండ్ ఉన్నది ఆయన ఆరా తీశారు. ఉపాధి పనుల ద్వారా వెదురు పెంపకానికి ఏ సహాయ సహకారాలు అందించుచున్నది సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ మంగల్దీప్, జాన్స్ బ్యాంబో ప్రతినిధులు వెదురు ఉత్పత్తులపై జిల్లా కలెక్టర్‌కు వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పిహెచ్ఓ దేవదానం, ఏడిఏ రామ్మోహన్ రావు, ఏపీడి లు శ్రీనివాస్ విశ్వనాథ్, దేగలయ్య, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ స్టేట్ లీడర్ హేమంత్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు కొండలరావు, ఎస్.కె.ఏ.కే.ఆజాద్, కన్సల్టెంట్ స్వాతి, కోఆర్డినేటర్లు సత్య ప్రసాద్, భార్గవ్, హారిక, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కొవ్వొత్తుల ర్యాలీ



చింతూరు, మేజర్ న్యూస్ : 104 ఎంఎంయు భవ్య హెల్త్ కేర్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గత ఏడు నెలల నుండి 104 ఉద్యోగులపై అనేక వేధింపులకు గురి చేస్తుందని, గత అరబిందో సంస్థ 104 ఉద్యోగులకు శబరి నెలలో చెల్లించిన జీతాలలో ప్రతి ఉద్యోగికి 500 నుండి 2000 వరకు కోతలు విధించిందని, అనేక సంవత్సరాల నుండి అమలులో ఉన్న 15 క్యాజువల్ లీవులను పూర్తిగా రద్దు చేసిందని బఫర్ సిబ్బందిని తొలగించిందని మంగళవారం రాత్రి చింతూరు మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ చెల్లించిన శబరినెల వేతనాలను ప్రతి ఉద్యోగికి కొనసాగించాలని ఇప్పటి వరకు తగ్గించిన వేతనాలను బకాయిలతో చెల్లించాలని, 14 ఉద్యోగులపై భవ్య యజమాన్య వేధింపులు షోకాజు నోటీసులు సస్పెండ్ చర్యలు నిలుపుదల చేయాలని, రద్దు చేసిన 15 క్యాజువల్ లీవ్‌లను తక్షణమే పునరుద్ధరించాలని, ఐదేళ్ల కాలపరిమితి చేసుకున్న 104 వాహన డ్రైవర్లకు నూతన స్లాబ్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 7 ప్రకారం డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని, తొలగించిన బఫర్ సిబ్బందిని పునరుద్ధరించాలని, ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు తక్షణం అదనపు సిబ్బందిని నియమించాలని పలు డిమాండ్లు 18 డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోట్ల పవన్ కుమార్, సి.పి.యం. నాయకులు సీసం సురేష్, ట్రెజరర్ వరప్రసాద్, నవీన్ కుమార్, పోశయ్య, రవ్వ శశి, ప్రకాష్, లక్ష్మి గూటాల ఏసురాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్టల్స్ అభివృద్ధికి ఐక్య కార్యాచరణ



**– కాకినాడ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలోని ప్రైవేట్ హాస్టల్స్ యజమానులంతా ఏకతాటిపైకి వచ్చి సంచలన నిర్ణయం తీసుకున్నారు. హాస్టల్స్ నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు మరియు విద్యార్థులు, ఉద్యోగులకు అత్యుత్తమ వసతులు కల్పించే లక్ష్యంతో సొసైటీ ఆఫ్ ప్రైవేట్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ గర్జించింది. శాంతినగర్‌లోని శ్రీ సాయి ఉమెన్స్ హాస్టల్ ప్రాంగణంలో అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో, సభ్యులంతా కలిసికట్టుగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకో వడం విశేషం. అసోసియేషన్ అధ్యక్షురాలు క్రాంతి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో హాస్టల్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య లపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షురాలు క్రాంతి మాట్లాడుతూ, తమ అసోసియేషన్ కేవలం ఒక సంఘం మాత్రమే కాదని, అది హాస్టల్స్ అభివృద్ధికి మరియు యజమానుల హక్కుల రక్షణకు ఒక కవచంలా పనిచేస్తుందని స్పష్టం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ మాట్లాడుతూ సభ్యుల మధ్య సమన్వయం పెరగాలని, అందరం కలిసి పనిచేస్తేనే హాస్టల్స్ వాతావరణాన్ని ఆధునికీకరించగలమని, తద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించవచ్చని పిలుపునిచ్చారు. నగరంలోని 50కి పైగా హాస్టల్స్ యజమానులు ఒకే వేదికపైకి వచ్చి తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు కాకినాడలో చర్చనీయాంశంగా మారింది. నూతన కార్యవర్గంగా గౌరవ అధ్యక్షురాలు కళావతి, అధ్యక్షురాలు క్రాంతి, కార్యదర్శి సురేష్, కోశాధికారి శివాజీ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, సహాయ కార్యదర్శి భవానిలతో పాటు కార్యవర్గ సభ్యులుగా విజయ్, పరమేష్, సత్యం, నివాస్, వీరబాబు, జై సూర్య, లక్ష్మి, అన్నపూర్ణ, విజయ్ కోపల్లి, సత్య కొఠారి లు ఎన్నికయ్యారు. ఈ శక్తివంతమైన బృందం హాస్టల్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని, ప్రజలందరి సహకారంతో హాస్టల్స్ వాతావరణాన్ని మరింత మెరుగుపరుస్తామని అసోసియేషన్ నమ్మకంగా ప్రకటించింది.

# రీ-సర్వేలో తప్పులు దొర్లకూడదు

**– జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో సాగుతున్న నాలుగో దశ రీ–సర్వే ప్రక్రియను ఎటువంటి తప్పులకు తావులేకుండా, అత్యంత పారదర్శకగా పూర్తి చేయాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో మండల సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలోని పెద్దాపురం డివిజన్ పరిధిలో గల 11 మండలాల్లోని 24 గ్రామాల్లో రీ–సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని, సుమారు 65 వేల ఎకరాల విస్తీర్ణంలో జరుగుతున్న ఈ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా 71 బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు.

సర్వే సజావుగా సాగేందుకు అవసరమైన రోవర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి అత్యాధునిక పరికరాలను సిబ్బందికి ఇప్పటికే అందుబాటులో ఉంచామని జేసీ తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించేటప్పుడు రైతుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని, భూ యజమానుల సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు జరగాలని ఆయన స్పష్టం చేశారు. దీనివల్ల భవిష్యత్తులో సరిహద్దు తగాదాలకు అవకాశం ఉండదని, సర్వే నాణ్యత పెరుగుతుందని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, గడువులోగా లక్ష్యలను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సర్వే శాఖ ఏడీ కె.శ్రీనివాసరావుతో పాటు వివిధ మండలాల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతా మాసోత్సవ 'వాక్‌థాన్'





శంఖవరం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 1 నుండి 31 వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం కత్తిపూడిలో భారీ వాక్‌థాన్ నిర్వహించారు. 'శిక్షణతో భద్రత మరియు సాంకేతికత ద్వారా పరివర్తన' అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం సాగింది. స్థానిక సీతారామ జూనియర్ కళాశాల సహకారంతో జరిగిన ఈ వాక్‌థాన్‌లో సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, రహదారి నియమాలపై నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అన్నవరం సబ్ ఇన్స్పెక్టర్ ఎల్.ప్రసాద్ మరియు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించగలమని, సాంకేతికతను జోడించి రహదారి భద్రతను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీతారామ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.అక్కారావు మరియు రోడ్డు భద్రత కమిటీ సభ్యురాలు బి. కాంతమ్మ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ విజయవంతానికి అన్నవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది, హైవే మొబైల్ రోడ్డు భద్రత బృందం మరియు స్థానిక వాలంటీర్లు సమర్థవంతంగా సహకరించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ అవగాహన ర్యాలీలో పాల్గొని రహదారి భద్రత పట్ల తమ బాధ్యతను చాటుకున్నారు.

# అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన




కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సత్కళావాహినిలో సోమవారం రాత్రి ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా, స్వరనర్తన నృత్య సంగీత విద్యాలయం విద్యార్ధినులచే కూచిపూడి నృత్య ప్రదర్శన అద్భుతంగా జరిగింది. ప్రదర్శనలో భాగంగా గణేష కాంతం, నమశివాయతే, జాతిశ్వరం మొదలుగు అంశాలు కూచిపూడి సంప్రదాయ శైలిలో నర్తకీమణులు చక్కగా ప్రదర్శించారు. రంగనాథుని అనిసం అంటూ రంగనాథుని స్తుతిస్తూ, గోదా కళ్యాణం మొదలగు అంశాలు ప్రేక్షకులని అలరించాయి. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శన కార్యక్రమానికి అవకాశం ఇచ్చిన సత్కళావాహిని నిర్వాహకులు కృష్ణమాచార్యులు స్వరనర్తన డైరెక్టర్ శ్రీమతి లక్ష్మ శాంతి ధన్యవాదములు తెలుపుకుంటూ ధనుర్మాస పర్వకాలంలో నృత్య కళ ద్వారా ఆధ్యాత్మిక విషయాలను ప్రదర్శించడంలో చిన్నారుల ప్రదర్శన అందరిని అబ్బురపరిచిందన్నారు. చాలా మంది చిన్నారులు మొదటిసారి ఈ నృత్య ప్రదర్శన చేశారు. చిరంజీవి ముంజులూరి వైష్ణవి ప్రదర్శన అందరిని అలరింపజేసింది, పుష్కరిణి, ధాక్షణ్య సిరి, రూప, ప్రవల్లిక, సాన్వి, చిక్విత మొదలగు చిన్నారులు చేసిన ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. మార్‌టెక్ సంస్థ సీనియర్ అధికారి ముంజులూరి సాగర్ మాట్లాడుతూ సత్కలవాహిని సాంస్కృతిక సంస్థ ద్వారా సంగీత సాహిత్య సాంస్కృతిక కళ వైభవాలను రానున్న తరానికి అందించేందుకు గత ఐదు దశాబ్దాలుగా ఎంతో కృషి చేస్తున్నారని నిర్వాహకులు కృష్ణమాచార్యుల దంపతుల కృషి ని కొనియాడారు. కాకినాడ వంటి కళా వైభవ నగరానికి ఈ సంస్థ మణిహారం లాగా ఉంటుందని సాగర్ అన్నారు. ఎంతో మంది చిన్నారులకు చక్కని వేదిక కల్పించి నృత్య ప్రదర్శన ప్రోత్సాహానికి ఎంతో సహాయ సహకార అందిస్తున్నారని కృష్ణమాచార్యుల దంపతుల సేవలను అభినందించారు. కాకినాడ పేరు చెప్పిన వెంటనే అద్భుత సంస్థ పేరును ప్రస్తావించే స్థాయికి ఆ దంపతులు నిరంతరం సేవ చేస్తున్నారని కొనియాడారు. విశ్రాంతి జీవితాన్ని మొత్తం కళా సాహిత్య పరిరక్షణకే అంకితం చేసిన దంపతులు కళామతల్లి వారసులుగా సాగర్ ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ సభ్యులు మైలవరపు సత్యనారాయణ (ఎమ్మెస్సార్) పట్టణ ప్రముఖులు అనేకమంది హాజరయ్యారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులందరినీ ప్రత్యేక జ్ఞాపికలతో సన్మానించారు.

# క్రమశిక్షణతో కూడిన మంచి విద్యను అందించాలి




**– జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన మంచి విద్యను బోధించాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాధ్యతగా మెలగాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. పోలవరం జిల్లా ముఖ్య కేంద్రమైన రంపచోడవరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలను జిల్లా విద్యాశాఖా అధికారి రామకృష్ణరావు మంగళవారం సందర్శించారు. ముందుగా రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డైట్ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలను పోలవరం జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణ రావు సందర్శించడం జరిగింది. ఉన్నత పాఠశాలలో జరిగిన అసెంబ్లీలో పాల్గొని, తర్వాత పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజులు ప్రణాళిక అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులతో వంద రోజులు ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని స్లిప్ టెస్ట్‌లు రాసారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాల సబ్జెక్టు ఉపాధ్యాయులతో స్టాప్ మీటింగ్ నిర్వహించారు. వంద రోజులు ప్రణాళిక అమలు చేస్తున్న విధానాన్ని ఉపాధ్యాయులతో మాట్లాడి ఏ విద్యార్థి ఏ గ్రేడ్‌లో ఉన్నారో తెలుసుకోవడం జరిగింది. తరువాత రంపచోడవరం జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో శిక్షణ ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ ఏ విధంగా జరుగుతున్నది అడిగారు. సబ్జెక్టులు వారీగా కళాశాల అధ్యాపకులతో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్నారు. ఛాత్రో ఉపాధ్యాయులలైన విద్యార్థులు నిబద్ధతతో శిక్షణ ముగించుకొని, పాఠశాల స్థాయిలో మంచి విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, ఎంఈఓ 2 సుబ్రహ్మణ్యం, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నిబాబు, ఉపాధ్యాయులు చిన్ని బాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వాహనాలకు ఆటోమేటిక్ ఫైన్ జనరేషన్




**– వాహనదారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వాహనములకు ఆటోమేటిక్ ఫైన్ జనరేషన్ అయ్యే విధానంపై కాకినాడ పట్టణంలోని ఇంద్రపాలెం బ్రిడ్జ్ వద్ద వాహనదారులకు కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల ప్రకారము, ట్రాఫిక్ సిగ్నల్స్ జంక్షన్ నందు వాహనదారులకు అవగాహన కల్పించారు. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ద్వారా, ట్రాఫిక్ నియమ, నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకి ఆటోమేటిక్ ఫైన్ జనరేషన్ సిస్టమ్ ద్వారా, ఈ-ఛలానా ఫైన్స్ వేయుబడతాయని, సదరు ఫైన్స్ వేసిన వివరములను వాహనదారులకి సెల్ ఫోన్ నకు టెక్స్ట్ మెసేజ్ రూపంలో వస్తాయని, కావున కచ్చితంగా ఈ క్రింది ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులు అవగాహన కల్పించడం జరిగింది.

మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రెడ్ సిగ్నల్ పడినప్పుడు వాహనదారులు తప్పనిసరిగా స్టాఫ్ లైన్ వెనుక ఆపవలెనని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా అందరు పాటించాలని, మోటార్ వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని అవగాహన కల్పించారు. సదరు అవగాహన కార్యక్రమంపై వాహనదారులు, పాదచారులు కాకినాడ పోలీసు వారికి హర్షధ్వానాలతో అభినందనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా అమలాపురం



అమలాపురం, మేజర్ న్యూస్ : అమలాపురం మునిసిపాలిటీని ఫస్ట్ గ్రేడ్ నుండి సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అమలాపురాన్ని అభివృద్ధి చేయాలంటే కాకినాడ, రాజమండ్రి కార్పొరేషన్ స్థాయికి వెళ్లాలన్న ఎమ్మెల్యే ఆనందరావు ఊహకు తొలి అడుగు పడింది. సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా గుర్తిస్తూ ప్రభుత్వం జిఒ జారీ చేసింది. ఇప్పటికే మూడు మేజర్ పంచాయితీలో కొంత భాగాన్ని మున్సిపాలిటీలో కలిపేందుకు ఈదరపల్లి, పేరూరు గ్రాభ సభల్లో ఆమోదం పొందింది. ఎమ్మెల్యే చొరవతో రెండు రోజుల్లో కామనగరువు పంచాయతీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. వచ్చే మున్సిపల్ ఎలక్షన్స్‌లో ప్రస్తుతం వున్న 30 వార్డులు స్థానే మూడు గ్రామాలు కలుపుకుని 40 వార్డులుగా మున్సిపాలిటీ రూపాంతరం చెందనుంది. తదుపరి కార్పొరేషన్ సాధనలో భాగంగా పట్టణానికి చేరువుగా వున్న 7 పంచాయతీలను కలిపేందుకు తదుపరి పావులు ఎమ్మెల్యే ఆనందరావు కదుపుతున్నారు.

## కోనసీమ జిల్లా మీడియా అక్రిడిటేషన్ సభ్యునిగా సుధీర్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా మీడియా అక్రిడిటేషన్ సభ్యునిగా సీనియర్ రిపోర్టర్ కాకర సుధీర్ నియమితులయ్యారు. సుధీర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు డిజిటల్ మీడియాలో స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేసిన సుధీర్ ప్రస్తుతం ఏబీపీ దేశం కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధిగా, ఆశాజ్యోతి పత్రిక స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. అక్రిడిటేషన్ సభ్యునిగా నియమితులైన సుధీర్‌ను ఏపీఎంఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.ఢిల్లీబాబురెడ్డి, ఏజేయూ సభ్యులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు బోళ్ల సతీష్, రంబాల సత్యనారాయణ, పలువురు మీడియా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

## ఎరువుల దుకాణాలలో వ్యవసాయ శాఖ స్పెషల్ స్క్వాడ్ తనిఖీ



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దాపురంలో మంగళవారం పురుగుల మందులు, విత్తనాల షాపులలో వ్యవసాయ శాఖ స్పెషల్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త తనిఖీలలో భాగంగా పట్టణం మరియు మండల పరిధిలోని పురుగుల మందులు, ఎరువుల దుకాణాలలో తనిఖీల చేపట్టారు. పట్టణంలోని సాయి జోషిని ఫెర్టిలైజర్స్, తాళ్ళూరి సూర్యనారాయణ సన్స్ షాపులలో తనిఖీ నిర్వహించారు. నాణ్యత పరమైన అంశాలు, స్టాక్ వివరాలు, లభ్యత, స్టాక్ రిజిష్టర్‌లు, ఫారం-ఎం, లైసెన్స్ కాపీలను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తనిఖీ అధికారులు తెలుపుతూ ఎరువుల డీలర్లు ప్రతీరోజు స్టాక్ బుక్ అప్‌డేట్ చేయాలని, ప్రతీ రైతుకు బిల్ తప్పనిసరిగా ఇవ్వాలని, విత్తనాలను, ఎరువులను ఎంఆర్‌పికి మించి అమ్మినచో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు సూచించారు. ఈ తనిఖీలలో ఏడిఏ మాలకొండయ్య, ఏఓ బి.జ్యోతి, పెద్దాపురం మండల వ్యవసాయాధికారి కె.సంజయ్ కుమార్ ఉన్నారు.

# కేశవరావు సారథ్యంలో జిల్లా ఇంటర్ విద్యకు నూతనోత్సాహం




## - బాధ్యతల స్వీకరణ

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా (డిఐఇఒ) వి.కేశవరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సుమారు 36 ఏళ్ల సుదీర్ఘ విద్యా సేవలో అంచెలంచెలుగా ఎదిగి, విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసే కేశవరావు రాకతో జిల్లా ఇంటర్ విద్యారంగంలో నూతన శకం ఆరంభం కానుంది. వృత్తి పట్ల అంకితభావం, విద్యార్థుల భవిష్యత్తుపై ఉన్న అపారమైన మక్కువతో ఆయన ప్రస్థానం సాగింది. గతంలో పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందించి, ప్రస్తుతం పదోన్నతిపై పీఆర్ కళాశాల ప్రాంగణంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కేశవరావు గతంలో ఎక్కడ పనిచేసినా అక్కడ తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా కాకినాడ వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో ఆయన చూపిన చొరవ అమోఘం. కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, సామాజిక బాధ్యతగా ఎస్‌ఆర్‌ఎంటి సంస్థ నుండి సుమారు 30 లక్షల రూపాయల నిధులను సేకరించి కళాశాల భవనాన్ని నిర్మించిన ఘనత ఆయనది. అలాగే ఓఎన్‌జీసీ సహకారంతో పది లక్షల రూపాయలతో విద్యార్థినుల సౌకర్యార్థం టాయిలెట్ల నిర్మాణం చేపట్టి విద్యార్థుల ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యతనిచ్చారు. నిరంతరం విద్యా ప్రమాణాల పెంపునకు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఆయన పడే తపన అందరినీ ఆకట్టుకునేది. 2019-20 సంవత్సరంలో ఆయన సేవలను గుర్తించిన అప్పటి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఃఉత్తమ ప్రిన్సిపాల్ః అవార్డుతో సత్కరించడం ఆయన కార్యదక్షతకు నిదర్శనం.

కిర్లంపూడి ఎంఈఓగా, నిడదవోలు కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయనకు ఉన్న అపార అనుభవం ఇప్పుడు జిల్లా ఇంటర్ విద్యార్థులకు వరం కానుంది. కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, జిల్లాలోని ఇంటర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ఆయన కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. విద్యార్థుల సౌకర్యాలు, విద్యాబోధనలో నాణ్యతను పెంచి, జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్న ఆయన ఆశయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అధ్యాపకులు, స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు కేశవరావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నేతృత్వంలో జిల్లా విద్యాశాఖ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ఏపిఎన్‌జిజిఓస్ అసోసియేషన్ వారి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏపీ ఎన్ జి జి ఓస్ అసోసియేషన్, ధవళేశ్వరం యూనిట్ అధ్యక్షులు ఎస్. జై కుమార్ ఆధ్వర్యంలో బి.ఏసుబాబు సూపరింటెండెంట్ ఇంజనీర్ , పి.ఐ.పి.ఎల్.ఎమ్.సి సర్కిల్, తుని వారిచే ఏపీ ఎన్జీజివోస్ అసోసియేషన్, ధవళేశ్వరం యూనిట్ యొక్క 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కాటన్ గెస్ట్ హౌస్ నందు ఆవిష్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ ఎం.ధర్మేంద్ర ధవళేశ్వరం యూనిట్ ట్రెజరర్ ఎం. రమేష్, ఉపాధ్యక్షులు ఎస్. సత్తి రాజు,ఎన్ గోపికృష్ణ, పి మోహన్, సంయుక్త కార్యదర్శులు ఎన్.వెంకట్రావు, ఎస్. శ్రీనివాసరాజు, ఎస్వి మోహన్, మహిళా సంయుక్త కార్యదర్శి సుహాసిని మరియు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు మరియు జిల్లా కౌన్సిల్ మెంబర్స్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# యువతరం జాగ్రత్తే.. దేశానికి శ్రీరామరక్ష




## - శ్రీ అగస్త్యలో రహదారి భద్రతపై సదస్సు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** నేటి వేగవంతమైన ప్రపంచంలో రహదారి భద్రత అనేది కేవలం నిబంధన మాత్రమే కాదు, అది ప్రతి ఒక్కరి జీవన్మరణ సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో భవిష్యత్ పౌరులైన విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు స్థానిక గాంధీనగర్‌లోని శ్రీ అగస్త్య జూనియర్ కాలేజీలో నిర్వహించిన అవగాహన సదస్సు ఆలోచింపజేసేలా సాగింది. రోడ్డు ప్రమాదాల నివారణలో యువత పాత్ర అత్యంత కీలకమని, క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ సమాజానికి రక్షణ కవచమని ఈ సదస్సు చాటిచెప్పింది. ఈ సదస్సులో కాకినాడ ట్రాఫిక్ సిఐ డి.రామారావు విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ, రహదారి నిబంధనలు అనేవి కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాదని, క్షమంగా ఇంటికి చేరడానికి అని స్పష్టం చేశారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు వివరిస్తూ, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను, ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రాణ నష్టాలను సాంకేతిక అంశాలతో సహా వివరించారు. ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకం, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి ఆత్మహత్య సదృశ్యమని హెచ్చరించారు.శ్రీ అగస్త్య విద్యాసంస్థల కరస్పాండెంట్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డి.ఎన్.ఆర్.) ప్రోత్సాహంతో, ప్రిన్సిపాల్ కె.ఎస్.బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త చైతన్యాన్ని నింపింది. కేవలం తరగతి గది పాఠాలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యత గల పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని యాజమాన్యం ఆకాంక్షించింది. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, వేగ పరిమితిని గౌరవించడం ప్రతి విద్యార్థి తన అలవాటుగా మార్చుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావుతో పాటు సీనియర్ జర్నలిస్టులు, కళాశాల సిబ్బంది పాల్గొని, రహదారి భద్రత అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని పునరుద్ఘాటించారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ విభాగంలో విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల (స్వయం ప్రతిపత్తి) ఫిషరీస్ విభాగము ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.

కాకినాడలోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల, మత్స్య మరియు ఆక్వాకల్చర్ విభాగానికి చెందిన బీఎస్సీ ఫిషరీస్ తృతీయ సంవత్సరం విద్యార్థుల కోసం హైదరాబాద్ బయోఫాక్టర్ కంపెనీ ఆధ్వర్యంలో రెండు రోజుల ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మత్స్య మరియు ఆక్వా కల్చర్ విభాగంలోనే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బయోఫాక్టర్ కంపెనీకి చెందిన రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సైంటిస్ట్ డాక్టర్ సుకుమార్ మరియు హెచ్.ఆర్ మేనేజర్ డాక్టర్ శరత్ భూషణ్ హాజరై శిక్షణను అందించారు. డాక్టర్ సుకుమార్ విద్యార్థులకు సాంకేతిక అంశాలు మరియు ఉత్పత్తులపై శాస్త్రీయంగా వివరించి, రొయ్యల మరియు చేపలకు సంబంధించి ప్రోబైయటిక్, గ్రోత్ ప్రోమోటర్స్ మరియు మినరల్ యొక్క ప్రాధాన్యతపై అవగాహనను కల్పించారు. డాక్టర్ శరత్ భూషణ్ మార్కెటింగ్‌లో మెళుకువలు, అలాగే సంస్థలో ఉద్యోగుల రోజువారీ విధులు మరియు బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. ఈ రెండు రోజుల కార్యక్రమం మొత్తం మత్స్య మరియు ఆక్వాకల్చర్ విభాగాధిపతి డాక్టర్ై. ఎన్. మూర్తి పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఫిషరీస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

# వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

## - ఎబిసి రామకృష్ణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** హాస్టల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా హెచ్‌డబ్లూఓలు (హాస్టల్ వెల్ఫేర్ అధికారులు) కృషి చేయాలని, పెద్దాపురం అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి పి.రామకృష్ణ సూచించారు. మంగళవారం పెద్దాపురం ఎబిసి కార్యాలయంలో ఎబిసి పరిధిలో గల హెచ్‌డబ్లూఓలతో సమీక్ష సమావేశం ఎబిసి రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ రానున్న పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులలో వందశాత ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. అలాగే ఎఫ్.ఆర్.ఎస్ పై సమీక్షించారు.

మెనూను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు అందజేయాలని సూచించారు. అలాగే హాస్టల్స్‌లలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌డబ్లూఓలు పి.వి.ఆర్.చాముండేశ్వరి, పి.సింహాచలం, బి.శ్రీవల్లి, ఆర్.వి.రాఘవమ్మ, ఎం.శైలజారాణి, పి.బి.శంకరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.